

కిలాడీ దంపతుల అరెస్టు

ఉద్యోగాలు వేయిస్తామని రూ.2కోట్లకు పైగా వసూలు చేసిన కిలాడీ దంపతులను తెర్లాం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు.

- 8లో



సాగుకు భరోసా...

విజయనగరం జిల్లాలో 2,57,413 మంది రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం అందించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. అర్హుల జాబితాలను ఆర్‌బీకేలలో ప్రదర్శించారు.

- 8లో

చెక్కవలస సమీపంలో గజరాజులు



కొమరాడ: మండలంలోని మాదలింగి నుంచి కురుపాం వెళ్లే రోడ్డులో గజరాజుల గుంపు సంచరిస్తోందని, మాదలింగి, పాలేం, చెక్కవలస, వన్నాం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది హెచ్చరించారు.

న్యూస్‌రీల్

త్వరితగతిన తోటపల్లి లైనింగ్ పనులు

- పర్యవేక్షక ఇంజినీరు పి.సుధాకర్



సుంకివద్ద రక్షణగోడ పనులు పరిశీలిస్తున్న ఎస్‌ఈ సుధాకర్

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువల లైనింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీర్ పి.సుధాకర్ ఆదేశించారు. ప్రాజెక్టు పరిధిలో సుంకి సమీపంలో జరుగుతున్న రక్షణ గోడ పనులు, పెదబుడ్డిడివద్ద జరుగుతున్న లైనింగ్ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ నాటికి లైనింగ్ పనులు పూర్తి చేసి ఆయకట్టుదారులకు పూర్తిస్థాయిలో సాగు నీటిని సరఫరాచేస్తామన్నారు. అనంతరం ఎం.రాజపురం, కత్తులకవిటి, హుస్సేనుపురంలో జరుగుతున్న లైనింగ్, బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఆయన వెంట డీఈ డి.రవికుమార్, ఏఈ శంకరరావు ఉన్నారు.

వెంకన్న ఆదాయం రూ.5.63 లక్షలు



తోటపల్లిలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. భక్తులు హుండీలలో వేసిన కానుకల రూపంలో రూ.5,63,743లు నగదు వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ఎల్.నగేష్ తెలిపారు. అలాగే, శ్రీ కోదండ రామాలయం హుండీల నుంచి రూ.21,800లు వచ్చిందన్నారు. 24గ్రాముల 800 మిల్లీగ్రాములు బంగారం, 11 కేజీల 500 గ్రాముల వెండి లభించిందని తెలిపారు. ఐదు నెలలకు సంబంధించి హుండీలలో భక్తులు స్వామివారికి వేసిన మొక్కులు, ముడుపులను లెక్కించామని చెప్పారు.

కోటదుర్గమ్మ హుండీల ఆదాయం లెక్కింపు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ అమ్మవారి హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఈ ఏడాది మార్చి 20 నుంచి ఈ నెల 16వ తేదీ వరకు 58 రోజులకు హుండీల ద్వారా రూ.7,20,305ల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ ఎం.ప్రసాద్ తెలిపారు. 138 గ్రాముల బంగారం, కేజీ 550 గ్రాముల వెండిని హుండీల్లో భక్తులు కానుకలుగా వేశారన్నారు.

సేవలకు సత్కారం

- నిస్వార్థంగా ప్రజలకు సేలందిస్తున్న వలంటీర్లు
- సచివాలయ పరిధిలో సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్న సేవకులు
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయడంలో కీలక బాధ్యత
- ఉత్తమసేవలందిస్తున్న వలంటీర్లకు ఈనెల 19 నుంచి సత్కారాలు
- జిల్లాలో 4,742 మంది గ్రామ/వార్డు వలంటీర్లు
- 19 మందికి సేవావజ్ర, 90 మందికి సేవా రత్న, 4,633 మందికి సేవా మిత్ర పురస్కారాలు
- పార్వతీపురం మన్యం జిల్లాకు రూ.4.87 కోట్లు మంజూరు



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)



పార్వతీపురంటౌన్: వలంటీర్లు.. అధికారులకు ప్రజలకు మధ్య వారధిలాంటివారు. అర్హులకు సంక్షేమ పథకాల చేరవేతలో గురుతర బాధ్యత వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేయడంలో కీలక భూమిక పోషిస్తున్నారు. ఊరూరా.. వార్డువార్డులో ప్రజా సేవకులుగా ముందుకు సాగుతున్నారు. ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. వారి సేవలను గుర్తించి సత్కరించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. పురస్కారాలతో గౌరవించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ నెల 19న ఆర్థిక ప్రోత్సాహకాలు అందజేయనుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం 4,742 మంది వలంటీర్లు ఉండగా అందులో 59 ఖాళీలు ఉన్నాయి. వీరిలో ఏడాది పాటు విధులు నిర్వహించిన 4,683 మందికి అవార్డులు ఇవ్వనుంది. వీరా ఖాతాల్లో ఈ నెల 19న రూ.4.84 కోట్ల ఆర్థిక ప్రోత్సాహాన్ని జమచేయనుంది.

19 మందికి సేవావజ్ర

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సేవలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వలంటీర్లకు సేవా వజ్ర అవార్డును అందజేస్తారు. జిల్లాలో మొత్తం 19 మందిని ఎంపిక చేశారు. వీరికి ఒకొక్కరికి రూ.30 వేలు ప్రోత్సాహం అందించి శాలువతో సన్మానం చేయనున్నారు. ఈ లెక్కన వీరందరికీ రూ.5.70 లక్షల నగదు, ప్రశంసాపత్రాన్ని, మెడల్, బ్యాడ్జిని అందజేయనున్నారు.

90 మందికి సేవారత్న

ప్రతి మండలం, మున్సిపాలిటీ నుంచి ఒక్కో వలంటీరు సేవా రత్న పురస్కారానికి ఎంపిక చేశారు. వీరికి ఒక్కొక్కరికి రూ.20వేల నగదు, ప్రశంసాపత్రం అందజేయనున్నారు. జిల్లాలో మొత్తం 90 మందికి రూ.18 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది.

4,633 మందికి సేవామిత్ర

వలంటీరుగా విధుల్లో చేరి ఏడాదికి పైగా సేవలందించి, ఎటువంటి ఫిర్యాదులేని ప్రతి వలంటీరుకు సేవామిత్ర పురస్కారం అందజేస్తారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు నగదు, బ్యాడ్జి, శాలువాతో సత్కరించనున్నారు. జిల్లాలో ఈ అవార్డుకు 4,633 మంది అర్హత కలిగిన వలంటీర్లు ఉన్నారు. వీరికి రూ.4.63 కోట్లు ఇవ్వనున్నారు.

రోజుకు రెండు సచివాలయాల్లో...

ఈ నెల 19 నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు వార్డు, గ్రామ సచివాలయాల్లో నిర్వహించాలని, దీనికి అవసరమైన కార్యాచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. జిల్లాలోని అన్ని సచివాలయాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి నెలరోజుల్లోగా పూర్తిచేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

పారదర్శకంగా ఎంపిక చేశాం



వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయం. వారు చేసిన సేవల ఆధారంగా సేవావజ్ర, సేవారత్న, సేవామిత్రలను పారదర్శకంగా ఎంపిక చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 19 నుంచి ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో సమావేశాలు నిర్వహిస్తాం. ఎంపికైన వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తాం.

– రామచంద్రరావు, జీఎస్‌డబ్ల్యూఎస్, జిల్లా అధికారి, పార్వతీపురం మన్యం

మండలం/పట్టణం వారీగా వలంటీర్లకు ప్రదానం చేయనున్న పురస్కారాలు ఇలా...

మండలం	సేవా వజ్ర	సేవా రత్న	సేవా మిత్ర
పార్వతీపురం అర్బన్	1	5	238
సాలూరు అర్బన్	0	5	232
పాలకొండ అర్బన్	1	5	138
వీరఘట్టం	1	5	379
సీతంపేట	1	5	323
భామిని	0	5	227
పాలకొండ	2	5	251
కొమరాడ	2	5	227
గుమ్మలక్ష్మీపురం	1	5	297
కురుపాం	0	5	241
జియ్యమ్మవలస	2	5	258
గరుగుబిల్లి	0	5	230
పార్వతీపురం	0	5	323
మక్కువ	2	5	294
సీతానగరం	2	5	299
బలిజిపేట	2	5	360
సాలూరు	2	5	193
పాచిపెంట	0	5	220

సీతంపేటలో జాబ్ మేళా రేపు



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: సీతంపేటలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో జాబ్‌మేళా పోస్టర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ మేళాకు 14 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. పదోతరగతి, డిగ్రీ, పీజీ చదివిన అభ్యర్థులు తమ వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఏపీఎస్ఎస్‌డీసీ నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 70320 60773, 63051 10947 నంబర్లను సంప్రదించాలన్నారు.

జగనన్న విదేశీ విద్యాదీవెనకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద ఆర్థిక సహాయం పొందేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత అధికారి ఎం.డి.గయాజుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 35 ఏళ్ల వయస్సులోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపు విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. అర్హులైన విద్యార్థులు జూన్ 10వ తేదీలోగా హెచ్‌టీటీపీ://జేఎన్ఎవీఎభూమి.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

20న గురుకుల ప్రవేశ పరీక్ష

పార్వతీపురం: గురుకులాల్లో ప్రవేశాలకు ఈ నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే 5, 6, 7, 8 తరగతుల విద్యార్థులు హెచ్‌టిటిపిఎస్://ఏపిఆర్ఎస్.ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్/స్టుడెంట్ లాగిన్‌లో, ఇంటర్, డిగ్రీ అభ్యర్థులు హెచ్‌టిటిపిఎస్://ఏపిఆర్ఎస్.ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్/ఏపిఆర్‌జేసీ నుంచి హాల్‌టిక్కెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

వక్ఫ్ సంస్థల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పార్వతీపురం: వక్ఫ్ బోర్డు సంస్థలు, దానికి సంబంధించిన ఆస్తుల నమోదు తప్పనిసరని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎం.లావణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం పార్వతీపురంలోని జిల్లా వక్ఫ్ బోర్డు కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

ఉద్యోగ సంబరం

- ఎస్ఎస్‌సీలో అన్నదమ్ముల విజయకేతనం



తాతయ్య, నాన్నమ్మతో ఉద్యోగ ఆనందం పంచుకుంటున్న ప్రేమ్‌చంద్, జయంత్

పార్వతీపురం: ఆల్ ఇండియా స్టాఫ్ సెలక్షన్ కమిషన్, కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవిల్ ఎగ్జామినేషన్ (ఎస్ఎస్‌సీ, సీజీఎల్–2022)లో పార్వతీపురం మండలం వెంకంపేటకు చెందిన అన్నదమ్ములు జాగాన ప్రేమ్‌చంద్ 317వ, జాగాన జయంత్ 594వ ర్యాంకు సాధించారు. ఇద్దరూ ఒకేసారి ఉద్యోగాలకు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు భవానీ, నాగేంద్రలు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. పాఠశాల విద్యను జవహర్ నవోదయలోను, కళాశాల విద్యను కూడా ఒకేచోట చదివారని, కంబైన్డ్ స్టడీ కలిసి వచ్చిందని, ఒకే విధమైన ఉద్యోగాలను సాధించడం గర్వంగా ఉందని తాతయ్య, నాన్నమ్మ స్వామినాయుడు, వెంకటమ్మ హర్షం వ్యక్తంచేశారు.

ఏనుగుల గణనకు 11 బృందాలు



సర్వే చేస్తున్న సిబ్బంది

సీతంపేట: అటవీశాఖ ఆధ్వర్యంలో ఏనుగుల గణన బుధవారం ప్రారంభమైంది. సీతంపేట, కొత్తూరు సెక్షన్‌లో అంటికొండ, పోలవరం, బాలేరు బీట్ పరిధిలో 11 బృందాలతో గణనకు ఉపక్రమించారు. టీమ్‌కు ఇద్దరు చొప్పున ఐదు స్క్వేర్ కిలోమీటర్ల విస్తీర్ణం పరిధిలో నడుచుకుంటూ వెళ్లి ఏనుగుల అడుగులు, పేడ, ఏనుగులు విరిచిన కొమ్మలు వంటివి కనిపిస్తే జీపీఎస్ డాటాలో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ప్రతిష్టాత్మకంగా 'జగనన్నకు చెబుదాం'

- నాడు–నేడు మూడో దశ పనులకు సిద్ధం కావాలి
- జూన్ నాటికి ప్రాధాన్యతా భవన నిర్మాణాలు పూర్తి
- ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలపై విస్తృత ప్రచారం
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పాల్గొన్న అధికారులు

విజయనగరం గంటస్తంభం: క్షేత్రస్థాయి సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించారని, దీనిని విజయవంతం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా, అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందించాలన్న లక్ష్యంతో కార్యక్రమాన్ని రూపొందించినట్టు వెల్లడించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు బాగా పని చేస్తున్నాయని, అక్కడక్కడా ఉన్నలోపాలను తొలగించి, మరింత సమర్థవంతంగా పనిచేయడానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమం దోహదపడుతుందన్నారు. వలంటీర్లకు సన్మాన కార్యక్రమం ఈ నెల 19 నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. గ్రామస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమంపై దృష్టిపెట్టాలని, డీఎల్‌డీఓ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు. వియనగరం ఉమ్మడి జిల్లాలోని పంచాయితీరాజ్, విద్య, వైద్య శాఖల ప్రగతి, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం సమీక్షించారు.

నాడు–నేడు ఫేజ్ 3 ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

నాడు–నేడు మూడో దశ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. మొదటి, రెండో దశ నాడు–నేడు పనులపై సమీక్షించారు. కొత్తగా ఎంపిక చేసిన పాఠశాలలతో పాటు మొదటి, రెండో దశలో ఎంపికైన పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, కాంపౌండ్ వాల్స్, టాయిలెట్ల నిర్మాణం తదితర మిగిలిపోయిన పనులను, పాఠశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాల మరమ్మతు పనులను మూడోదశలో పూర్తిచేయాలన్నారు. పనులను ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కోరారు.

జూన్ నెలాఖరుకు ప్రాధాన్యతా భవన నిర్మాణాలు పూర్తికావాలి

ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిచ్చి నిర్మిస్తున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అధికారులను జెడ్పీచైర్మన్ ఆదేశించారు. సిమెంట్, ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రి సిద్ధంగా ఉందని, ఇటీవలే పెండింగ్ బిల్లులను విడుదల చేశామని చెప్పారు. బిల్లులు చెల్లించినప్పటికీ పనులను ప్రారంభించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనాల నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఏజెన్సీలను తొలగించి, కొత్త కాంట్రాక్టర్లను ఎంపిక చేయాలని సూచించారు. వారం రోజుల్లో అన్ని భవనాల నిర్మాణ పనులు ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. చివరి దశలో ఉన్న పనులను ప్రారంభించేందుకు సిద్ధం చేయాలన్నారు.

నిర్ణీత కాలవ్యవధిలో 'గడపగడప'లో గుర్తించిన పనులు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని జెడ్పీ చైర్మన్ అన్నారు. జిల్లాలో ఇప్పటికే 70 శాతం గ్రామాల్లో ఈ కార్యక్రమం పూర్తయిందని చెప్పారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఇప్పటికే సుమారు రూ.70లక్షలు వరకు బిల్లులు చెల్లించినట్టు వెల్లడించారు. జరిగిన పనులకు బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఇప్పటివరకు ఆమోదం పొందిన అన్ని పనులను వారం రోజుల్లోగా ప్రారంభించాలని ఆదేశించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌పై విస్తృత ప్రచారం

గ్రామీణ ప్రజల చెంతకే వైద్యసేవలను అందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం దేశంలోనే ఒక వినూత్నమైన, ఆదర్శనీయమైన కార్యక్రమమని జెడ్పీచైర్మన్ పేర్కొన్నారు. ఈ విశిష్ట కార్యక్రమం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఆయా గ్రామాలకు డాక్టర్లు వెళ్లే కార్యక్రమం షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటించడం వల్ల వైద్యసేవలను సద్వినియోగం చేసుకునే అవకాశం ప్రజలకు కలుగుతుందన్నారు. సీఈఓ, డిప్యూటీ సీఈఓ, డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను అందరికీ చేరువయ్యేలా చూడాలన్నారు.

సమావేశంలో జెడ్పీ సీఈఓ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల డీఈఓలు, డ్వామా పీడీలు, పంచాయతీరాజ్ ఎస్ఈలు, డీసీహెచ్ఎస్‌లు, డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

తాళికట్టు శుభవేళ..

- ఉమ్మడి విజయనగరం జిల్లాలో పెళ్లి సందడి
- మే, జూన్ నెలల్లో మంచి ముహూర్తాలు
- వేలాది జంటలు వివాహ, శుభ కార్యాలకు ఏర్పాట్లు
- వివిధ రంగాల వారికి భారీగా పెరిగిన డిమాండ్



విజయనగరం: పెళ్లంటే నూరేళ్ల పంట. రెండు జంటల కలయిక. రెండు కుటుంబాల అనుబంధం. వీటిన్నింటితోపాటు విభిన్న వృత్తుల వారికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కలిగించే క్రతువు. ఏటా వలే ఈ ఏడాది కూడా మే, జూన్ మధ్య వరుసగా శుభ ఘడియలుండడంతో వివాహాలు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. జూన్ 18 నుంచి ఆగస్టు 18 వరకు శుక్రమూఢమి కారణంగా వివాహాలకు వీలు లేదు. అందుకనే వీలున్న ముహూర్తాల్లోనే శుభకార్యాలు జరిపించేందుకు తొందర పడుతున్నారు. పక్షం రోజులుగా ఉమ్మడి జిల్లాలో పెళ్లి బాజాలు మోగుతున్నాయి.

వేదికలకు ముందస్తు బుకింగ్..

చాలా రోజుల తర్వాత కల్యాణ మండపాలు కళకళలాడుతున్నాయి. షామియానాలు, క్యాటరింగ్‌కు గిరాకీ పెరిగింది. ప్రస్తుత ముహూర్తాల్లో వివాహాలతో పాటు గృహ ప్రవేశాలు, భూమి పూజలు, ఉపనయనాలు, బారసాలలు వంటి శుభకార్యాలూ జరుగుతున్నాయి. ఎండలు ఎక్కువగా ఉండడంతో ఏసీ కళ్యాణ మండపాలను బుక్‌చేసేందుకు అధిక మంది మొగ్గు చూపుతున్నారు. దీనిని అదునుగా చేసుకుని కొందరు మండపాల అద్దెలూ పెంచేస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఏసీ కల్యాణ మండపం ధర సుమారుగా రూ.1.50 లక్షకుపైగానే పలుకుతోంది. అదీ కాకుండా పూల అలంకరణ, కరెంట్ చార్జీలు, మంగళవాయిద్యాలు, ఇతర ఖర్చులు అంతకంటే రెట్టింపు అవుతోంది. పల్లెల్లో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు మాత్రం చలువ పందిళ్లు, సాధారణ కల్యాణ మండపాలనే ఎంచుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదివరకే ఖరారైన వివాహాలకు తగినట్లుగా వేదికలను బుక్ చేసుకున్నారు. ఇవి దొరకని వారు దేవాలయాలు, ఇళ్ల వద్ద, ఖాళీ ప్రదేశాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు జిల్లాల్లో కలిపి 120 వరకు ఏసీ, నాన్ ఏసీ కళ్యాణ మండపాలు ఉంటాయని అంచనా. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి మండలంలోనూ ఒకటి రెండు ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. ఇవన్నీ దాదాపుగా ప్రస్తుతమున్న ముహూర్తాలకు బుక్ అయ్యాయి.

మంచి ముహూర్తపు తేదీలు..	
మే నెల:	20, 21, 26, 27, 28, 30, 31.
జూన్:	1, 3, 5, 7, 8, 9, 10, 11, 14

ఉపాధి లభిస్తోంది..

ఈసారి అధిక సంఖ్యలో ముహూర్తాలు ఉండడంతో వివాహాది శుభకార్యాలపై ఆధారపడి ఉపాధి పొందుతున్న వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టెంట్ హౌస్, డెకరేషన్ వ్యాపారులు, పురోహితులు, బ్యాండ్, కేటరింగ్, ఫొటోగ్రాఫర్లు, వంట మాస్టర్లు, ట్రావెల్స్, వీడియోగ్రాఫర్లు ఇలా పలు రంగాలకు చెందిన వారు ఈ రెండు నెలలు అస్సలు ఖాళీలేనంతగా పని లభిస్తోందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇదే మంచి తరుణం

ఈ నెల నుంచి జూన్ 14 వరకు మంచి ముహూర్తాలున్నాయి. జూన్ 18 నుంచి ఆగస్టు 18 వరకు శుక్రమూఢమి కారణంగా వివాహాలకు వీలు లేదు. దీంతో ప్రస్తుత మంచి రోజుల్లోనే ఎన్నో వివాహాలు, ఇతర శుభకార్యాలు ఖాయం చేసుకున్నారు. పురోహితులతో పాటు పెళ్లి తంతు కార్యక్రమాలు నిర్వహించే వారికి డిమాండ్ నెలకుంది.

– రామానుజాచారి, పురోహితుడు



వివాహ వేడుకకు సిద్ధంగా ఉన్న వేదిక



విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న కళ్యాణ మండపం

క్లుప్తంగా

పెద్దమనిషిపై దాడి



చికిత్సపొందుతున్న దుర్గారావు, గౌరీశ్వరరావు

పార్వతీపురం: ఇద్దరి మధ్య జరుగుతున్న గొడవను సర్ది చెప్పడానికి వెళ్లిన పెద్దమనిషిపై దాడి జరిగింది. ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బలిజిపేట మండలం పెద్దింపేట గ్రామంలో సిమెంట్ గోడకు ప్లాస్టింగ్ చేయకపోవడంతో నీరుకారి ఇంటిలోకి వస్తోందని మంతిని గౌరీశ్వరావు, పెంకి శ్రీనుల మధ్య గొడవ మంగళవారం రాత్రి జరుగుతోంది. ఈ విషయంలో కలుగజేసుకున్న మజ్జి దుర్గారావు ఇద్దరికీ సర్ది చెబుతున్నప్పుడు పెంకి శ్రీను కొడుకులు అరవింద్, లవణాలు మీరు ఎవరు మాకు చెప్పడానికి అంటూ దురుసుగా వచ్చి దుర్గారావుపై వెదురు కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో దుర్గారావుకు పలుచోట్ల గాయాలయ్యాయి. అలాగే మంతిని గౌరీశ్వరరావును కూడా కొట్టారు. దీంతో గాయాలపాలైన ఇద్దరిని 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

40 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

గజపతినగరం: మండలంలోని ఎం.వెంకటాపురం గ్రామంలో అక్రమంగా మద్యం వ్యాపారం సాగిస్తున్న వియ్యపు అప్పలరాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కాలంరాజుపేట గ్రామానికి చెందిన వి.అప్పలరాజు అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నాడన్న సమాచారం మేరకు నిఘా వేసి ఎం.వెంకటాపురం గ్రామంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని 40మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగరాజు వివరించారు.

కేజీ వెండి వస్తువుల చోరీ

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో రెల్లివీధిలో ఎం.సూర్యప్రకాశ్ ఇంట్లో మంగళవారం రాత్రి దొంగలు పడి కేజీ బరువుగల వివిధ రకాల వెండి వస్తువులను దోచుకుపోయినట్లు బాధితుడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. వెండిచెంబు, వెండిగిన్నె, వెండి కుంకుమ భరిణె, వెండి ప్లేట్ తదితర వస్తువులను ఇంట్లో గల బీరువాలో పెట్టామని తెల్లవారున చూసేసరికి బీరువా చిందరవందరగా ఉండడంతో పరిశీలించగా వెండివస్తువులు లేవని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.వెంకటేశ్వర్లు తెలిపారు.

20, 21 తేదీల్లో అండర్-19 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

- నేడు కబడ్డీ, ఖోఖో అంశాల్లో తుది జట్టు ఎంపికలు

విజయనగరం: అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20, 21 తేదీల్లో విజయనగరం వేదికగా రాష్ట్రస్థాయి బాల, బాలికల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ కృష్ణ బుధవారం తెలిపారు. నగరంలోని రాజీవ్‌క్రీడా మైదానం ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన బాల, బాలికలు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా తుది జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 18న సాయంత్రం 4 గంటలకు రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహించనున్నామన్నారు. ఇప్పటికే జరిగిన ఎంపిక పోటీల్లో ప్రాబబుల్స్ జట్టుకు అర్హత సాధించిన కబడ్డీ, ఖోఖో క్రీడాకారులు విధిగా తుది జట్టు ఎంపిక పోటీలకు హాజరుకావాలని స్పష్టం చేశారు.

'సరోజ' పోస్టర్ విడుదల



సరోజ పోస్టర్‌ను ఆవిష్కరించిన సీతం కాలేజీ డైరెక్టర్ డాక్టర్ శశిభూషణ్, పల్సర్ బైక్ రమణ

విజయనగరం అర్బన్: జానపద గాయకుడు పల్సర్ బైక్ రమణ నూతనంగా రూపొందించిన 'సరోజ' ఆల్బమ్ పోస్టర్‌ను స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శశిభూషణ్ మాట్లాడుతూ, పల్సర్ బైక్ రమణ కళాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నాడని తెలిపారు.

కిలాడీ దంపతుల అరెస్ట్

- ఉద్యోగాలు వేయిస్తామని రూ.2కోట్లకు పైగా వసూలు
- ఏడాదిగా పరారీలో భార్యాభర్తలు
- రాజస్థాన్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు



పోలీసులు అరెస్ట్ చేసిన భార్యాభర్తలు

తెర్లాం: ఆంధ్రా యూనివర్సిటీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి ఒక్కో ఉద్యోగానికి రూ.3లక్షల నుంచి రూ.6లక్షల వరకు నిరుద్యోగుల నుంచి వసూలు చేసి సుమారు రూ.2కోట్లతో పరారైన దంపతులను స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ బుధవారం తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెరుమాళి గ్రామానికి చెందిన బేరి గంగాధర్, భార్య పూర్ణచందనలు ఏయూలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిపై ఉద్యోగాలు వేయిస్తామని నమ్మించి వారి బంధువుల వద్ద, వేరే ప్రాంతాలకు చెందిన ఇతరులు, మధ్యవర్తుల వద్ద ఏడాది క్రితం సుమారు రూ.2కోట్లకు పైగానే వసూలు చేశారు. ఉద్యోగాలు వేయిస్తామని డబ్బులు తీసుకున్న వారిలో ఒకరిద్దరికి ఆంధ్రా యూనివర్సిటీలో ఉద్యోగం ఇచ్చినట్లు నకిలీ నియామక పత్రం, ఐడెంటిటీకార్డులు చూపించగా చాలామంది ఉద్యోగాలు వస్తాయని ఆశపడి వారు అడిగినంత ఇచ్చారు. డబ్బులు తీసుకున్న తరువాత ఎప్పటికీ ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో మాకు ఉద్యోగాలైనా ఇవ్వండి, లేదా డబ్బులైనా ఇవ్వండని గంగాధర్, భార్య పూర్ణ చందనను బాధితులతోపాటు, మధ్యవర్తులుగా ఉండి డబ్బులు ఇప్పించిన వారు విశాఖపట్నంలో వారు నివాసముంటున్న ఇంటికి వెళ్లి డిమాండ్ చేశారు. కొద్దిరోజుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, లేదంటే డబ్బులు తిరిగి ఇస్తామని నమ్మించి అక్కడి నుంచి వేరే రాష్ట్రాలకు భార్యాభర్తలిద్దరూ పరారయ్యారు.

దంపతుల కదలికపై నిఘా

దీంతో బాధితుల్లో కొంతమంది తెర్లాం పోలీస్‌స్టేషన్‌లో కొన్ని నెలల క్రితం ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఉన్న ఎస్సై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన తరువాత బదిలీపై వెళ్లిపోయారు. ఆ తరువాత తెర్లాం ఎస్సై విధుల్లో చేరిన ఆర్.రమేష్ ఈ కేసుపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు. గంగాధర్, ఆయన భార్య కదలికలపై నిఘా వేసి వారు రాజస్థాన్‌లో ఉన్నట్టు తెలుసుకుని బాధితుల్లో ఒకరిని, సిబ్బందిని అక్కడికి పంపించి వారిని పట్టుకుని మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఎస్సై రమేష్ ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని తెలియజేసి, భార్యభర్తలను మంగళవారం అరెస్ట్ చేసి బొబ్బిలి కోర్టుకు తరలించారు.

విద్య, గృహరుణాలు మంజూరు చేయాలి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఆర్థికాభివృద్ధిలో బ్యాంకులు కీలకమని వివిధ రంగాలకు రుణాలను అందించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో బ్యాంకర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకుల లక్ష్యాలు, రుణాల మంజూరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యతరగతి, అల్పాదాయవర్గాల వారికి కూడా గృహనిర్మాణానికి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. చదువుకునేందుకు అవసరమైన ఆర్థిక వనరులను విద్యారుణాలద్వారా బ్యాంకులు సమకూర్చాలని స్పష్టం చేశారు. అటవీ ఉత్పత్తులు, ఇతర పంటల సాగుకు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూములకు వ్యవసాయ భూములతో రుణాలను మంజూరుచేయాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు పశుసంవర్థక యూనిట్లు మంజూరుచేయాలని సూచించారు. కేంద్ర ఆర్థికశాఖ ఆదేశాల ప్రకారం ఆర్థిక వనరులు సమకూర్చడంద్వారా వేగంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం గల 112 వెనుకబడిన జిల్లాల్లో పార్వతీపురం ఒకటిగా గుర్తించారన్నారు.

ఇబ్బందులుంటే తెలియజేయండి

లీడ్ బ్యాంక్ మేనేజర్ జేఎల్ఎస్.మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల్లో రుణాలకు సంబంధించి దరఖాస్తులను బ్యాంకర్లు తిరస్కరించకూడదని, రుణాల మంజూరులో ఇబ్బందులుంటే సంబంధిత శాఖాధికారులకు తెలియజేయాలని కోరారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, పశుసంవర్థక శాఖాధికారి ఎ.ఈశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారి కేఎస్ఎన్.రెడ్డి, మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ టీపీఎంయూ ఏపీడీ వై.సత్యంనాయుడు, జిల్లా పరిశ్రమల అధికారి సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

- విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగించాలి
- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: ఆరోగ్యకరమైన సమాజానికి పర్యావరణ పరిరక్షణ తప్పనిసరి అని, పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. మిషన్ లైఫ్‌లో భాగంగా పర్యావరణ ప్రవర్తనలో మార్పు అనే అంశంపై ప్రభుత్వ శాఖల అధికారులతో జేసీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు పలు శాఖల ద్వారా చేపట్టనున్న కార్యాచరణపై జేసీ పలు సూచనలు చేశారు. విద్యుత్తును, నీటిని పొదుపుగా వాడాలని, ఈ విషయాలపై ఆయా శాఖలు విస్తృత అవగాహన కలిగించాలన్నారు. పర్యావరణానికి ముప్పు కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, ఈ వేస్ట్‌ను తగ్గించాలని కోరారు. తడిచెత్త పొడి చెత్తలను వేరు చేసి శాస్త్రీయంగా నిర్వహించాలని సూచించారు. పచ్చదనాన్ని పెంచి, సేంద్రియ ఆహారాన్ని వినియోగించి ఆరోగ్యకరకరమైన వాతావరణంలో జీవించేలా చూడాలని హితవు పలికారు. విద్యార్థి దశ నుంచి పర్యావరణంపై అవగాహన కలిగించాలని లేకుంటే భవిష్యత్తు కాలుష్య కోరల్లో చిక్కుకుంటుందని, అందుకోసం ప్రతి పాఠశాల, కళాశాలలో అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి, డీఆర్‌డీఏ పీడీ, డీపీవో, డీఈవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, పోలీస్ శాఖ అధికారులతో పాటు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

వీఆర్వోకు షోకాజ్ నోటీసు

సీతానగరం: మండలంలో విధులు సక్రమంగా నిర్వహించక, రీ సర్వే పనులు నిర్వహించక అధికారులకు ఎటువంటి సమాచారం లేకుండా విధులకు డుమ్మా కొడుతున్నారని ప్రజలనుంచి అందిన అభియోగాలపై సూరంపేట వీఆర్వో వి.పాణిగ్రాహికి కలెక్టరేట్ నుంచి జారీ అయిన షోకాజ్ నోటీసు అందచేశామని హెచ్‌డీటీ షేక్ ఇబ్రహీం తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే భూముల రీ సర్వే పనులను క్లస్టర్ పరిధిలో నిర్వహించక పోగా, ఉన్నతాధికారులనుంచి వస్తున్న ఫోన్‌కాల్స్‌కు స్పందించకుండా ఫోన్ స్విచాఫ్ చేయడం, విధులకు క్రమంగా హాజరుకాకపోవడానికి గల కారణాలు, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పట్టించుకోనందుకు గల కారణాలపై లిఖిత పూర్వకంగా ఆయన సమాధానం ఇవ్వాలని నోటీసుజారీ అయిందన్నారు. సమాధానం సంతృప్తిగా లేని పక్షంలో ఉన్నతాధికారులు తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని నోటీసులో పేర్కొన్నట్లు వివరించారు.

117 మంది జన్మభూమి ఇళ్లపట్టాల రద్దు

కొత్తవలస: గత ప్రభుత్వం హయాంలో నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా 6వ విడత కొత్తవలస మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కొత్తవలస రెవెన్యూ పరిధిలో సర్వేనంబర్ 168,173లలో 2019లో 679 మందికి ఇళ్లపట్టాలను అప్పట్లో అందజేశారు. కాగా ప్రస్తుతం ఈ పట్టాలపై విచారణ చేయగా పట్టాలు పొందిన వారిలో 117 మందిని అనర్హులుగా గుర్తించినట్లు తహసీల్దార్ మేమంత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ 117 మంది పట్టాలను రద్దు చేయాలని ఆర్‌డీఓకు నివేదించినట్లు చెప్పారు. ఈ పట్టాల రద్దుపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే 7 రోజుల్లో లిఖితపూర్వకంగా కొత్తవలస తహసీల్దార్‌ను సంప్రదించాలని సూచించారు. కాగా అర్హత కలిగిన 562 మంది మరో మారు ఆయా గ్రామాల సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.

సాగుకు భరోసాతో రైతు ఉత్సాహం

- జిల్లాలో 2,57,413 మంది లబ్ధిదారులు
- ఆర్బీకేల్లో అర్హుల జాబితా
- నాలుగో ఏడాది రైతు భరోసా పంపిణీకి చర్యలు



నాయుడువలస ఆర్బీకేలో వైఎస్సార్ రైతుభరోసా అర్హుల జాబితా ప్రదర్శిస్తున్న సచివాలయ సిబ్బంది

రామభద్రపురం: గతంలో అన్నదాతలు పొలాలను సాగు చేసేందుకు సీజన్ ప్రారంభంలో వడ్డీ వ్యాపారుల వద్ద వడ్డీకి అప్పు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు. రైతు భరోసా పథకం ద్వారా ఆర్థికంగా రైతులను ఆదుకుంటున్నారు.అందులో భాగంగానే నాలుగో విడత రైతు భరోసా డబ్బును వారి అకౌంట్లలో జమ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో మంది 2,57,413మంది అర్హులు

విజయనగరం జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాన్ని గతంలో పొందుతున్న వారు 2,51,659 మంది కాగా కొత్తగా దరఖాస్తు చేసుకున్నా వారు 5,754 మంది. మొత్తం కలిపి 2,57,413 మంది రైతులు అర్హులుగా ఎంపికయ్యారు. వారికి రైతు భరోసా నగదు జమ కానుంది.

రైతు భరోసా పొందడం ఇలా..

భూమి ఉన్న ప్రతి రైతు రైతుభరోసా నగదు పథకానికి అర్హుడు. అలాగే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద ప్రయోజనం పొందే వారంతా ఈ పథకానికి అర్హులే. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం తీసుకుని స్థానిక ఆర్బీకేలలోని వీఏఏలకు అందజేస్తే వారు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఇందులో కేంద్రప్రభుత్వం మూడు విడతలలో రూ.2 వేల చొప్పున జమచేయగా రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో రూ.7.500 జమ చేస్తుంది. దీంతో ప్రతి రైతన్నకు ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం అందుతుంది.

గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు



గత ప్రభుత్వాలు రైతుల గురించి కనీసం పట్టించుకోలేదు.మూడేళ్ల నుంచి ఏటా రైతుభరోసా డబ్బు ఖాతాలో జమఅవుతోంది. ఖరీఫ్ ప్రారంభంలో ప్రభుత్వం చేస్తున్న సాయం సేద్యపు ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం మాట తప్పని నేతగా సీఎం జగన్ సాయం చేస్తున్నారు.

గుల్లిపల్లి అప్పారావు, రైతు,రామభద్రపురం

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రైతు భరోసా ద్వారా రూ.13,500 ప్రభుత్వం సాయంతో కొంత మేర అప్పుల బాధ తప్పింది.ఖరీఫ్ ప్రారంభంలో పెట్టుబడి సాయం వ్యవసాయ ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ముఖ్యమంత్రి మా లాంటి రైతులకు ఎనలేని సేవలు అందిస్తున్నారు. మా రైతులమంతా రుణపడి ఉంటాం.

కేతిరెడ్డి రామారావు, రైతు, నాయుడువలస

రైతులందరికీ రైతు భరోసా



వైఎస్సార్ రైతు భరోసాకు సంబంధించి ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగదు. ఇప్పటికే ఆర్బీకేలలో అర్హుల జాబితాను నోటీస్‌బోర్డులో ఉంచాం.జాబితాలో పేరు లేకుంటే ఈ నెల 18వ తేదీలోపు వీఏఏలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలించి అర్హత ఉంటే నమోదు చేస్తారు.

వీటీ రామారావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, విజయనగరం

ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు



కురుపాం ఆస్పత్రిలో అభిలాష్‌కు చికిత్స అందిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం /కురుపాం: గుమ్మలక్ష్మీపురం మండలం అచ్చబ గ్రామ సమీపంలోని ఘాట్‌రోడ్డులో ఆటో బోల్తా పడడంతో ఐదుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లో నివాసముంటున్న సతివాడ చిన్నారావు, గౌరీశ్వరి, సీతాదేవి, మహాలక్ష్మి, అభిలాష్‌లు కొమరాడ మండలం వన్నాంలోని బంధువుల ఇంటికి కొద్ది రోజుల క్రితం వచ్చారు. అక్కడి నుంచి ఒడిశా రాష్ట్రంలోని రాయగడ మజ్జి గౌరమ్మ ఆలయానికి దర్శనం నిమిత్తం వెళ్లి వస్తుండగా ఘాట్‌రోడ్డు వద్ద అదుపుతప్పి ఆటో బోల్తా పడగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదాన్ని అటుగా వెళ్తున్న వారు గమనించి క్షతగాత్రులను కురుపాం ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యాధికారి శ్రీధర్ ప్రథమ చికిత్స అందించారు. గాయపడిన వారిలో అభిలాష్ కాలు విరిగిపోగా, మహాలక్ష్మి, గౌరీశ్వరిల పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ సంఘటనపై ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

108 వాహనం ఢీకొని ఒకరికి..



పార్వతీపురం: చికిత్స పొందుతున్న తిరుపతిరావు

పార్వతీపురం: వంగర మండలం బేగంపేట గ్రామానికి చెందిన జి. తిరుపతిరావు ద్విచక్ర వాహనంపై వస్తుండగా వెనుక నుంచి 108 అంబులెన్స్ ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. తిరుపతిరావు పార్వతీపురం ఫ్లైఓవర్‌పై నుంచి సాయిబాబా గుడి రహదారిగుండా ద్విచక్రవాహనంపై వస్తుండగా సాయిబాబా గుడి సమీపంలో 108 అంబులెన్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తిరుపతిరావుకు పలుచోట్ల గాయాలుకాగా అదే 108 వాహనంలో చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం ఢీకొని వాకర్‌కు..



చికిత్స పొందుతున్న ప్రభాకర్

మార్నింగ్ వాక్ చేస్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో గాయాలపాలయ్యాడు. పార్వతీపురం నుంచి నర్సిపురంవైపు మార్నింగ్ వాక్ చేస్తున్న లాడి ప్రభాకర్‌ను నర్సిపురంనుంచి పార్వతీపురం వైపు వస్తున్న ద్విచక్ర వాహన చోదకుడు బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ప్రభాకర్‌కు పలుచోట్ల గాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.

ఆత్మహత్యపై అనుమానాలు

- పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు



పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

రామభద్రపురం: మండలంలోని ముచ్చర్లవలస గ్రామంలో ఇటీవల యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో అనుమానాలు వ్యక్తంచేస్తూ కుటుంబసభ్యులు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రేగాన గణేశ్వరరావు(29) ఈ నెల 10వ తేదీ వేకువజామున ఇంటి వెనుక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో వారి సంప్రదాయం ప్రకారం కుటుంబసభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు. అయితే వారం రోజులు పోయాక ఆ ఆత్మహత్యపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, ఇది ఆత్మహత్య కాదని, దీని వెనుక కొంత మంది వ్యక్తులు కారణమై ఉంటారని, దర్యాప్తు చేసి న్యాయం చేయాలని కోరుతూ 16వ తేదీన మృతుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దీంతో ఎస్సై సురేంద్రనాయుడు ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యాధికారి, ఇన్‌చార్జి తహసీల్దార్, వీఆర్వోలు పాతిపెట్టిన మృతదేహాన్ని బుధవారం బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సిఐ సిహెచ్. లక్ష్మణరావు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: చోరీ కేసులో నిందితుడ్ని టూటౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజుల రేగకు చెందిన వై.నూకరాజు ఈ నెల 15న రాత్రి ఇంటికి తాళం వేసి డాబాపై నిద్రిస్తుండగా అదేవీధికి చెందిన దుర్గాప్రసాద్ ఇంటి తాళం పగులగొట్టి, లోపలికి ప్రవేశించాడు. బీరువా తెరిచి ఎటువంటి విలువైన వస్తువులు దొరక్కపోవడంతో ఇంట్లో ఉన్న మొబైల్ ఫోన్ తీసుకువెళ్తుండగా శబ్దం రావడంతో నూకరాజు లేవగా నిందితుడు పారిపోయాడు. తరువాత నూకరాజు ఇంట్లోకి వెళ్లిచూడగా వస్తువులన్నీ చిందరవందరగా ఉండడం, సెల్‌ఫోన్ పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టగా స్థానిక పుత్సల వీధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడు దుర్గాప్రసాద్‌ను ఎస్సై షేక్‌శంకర్ పట్టుకుని విచారణ చేశారు. అనంతరం నిందితుడి దగ్గర నుంచి మొబైల్ ఫోన్ రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 484.00
శ్రీకాకుళం	రూ. 484.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	61,800-00
బంగారం(22క్యా. 10గ్రా.)	56,650-00
వెండి (కిలో)	78,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹142	₹254	₹ 264